ప్రజాశక్తి
www.prajasakti.com
శనివారం 9 మార్చి 2024
5
వైఎస్ఆర్

అన్నదానం గొప్పది

కడప : శ్రీ సాయి యువజన సేవా సంఘం చైర్మన్ మలిరెడ్డి చంద్ర శేఖర్‌రెడ్డి ఆధ్వర్యంలో శుక్రవారం కడప జడ్‌పి కాంపౌం డ్‌లోని పట్టణ నిరాశ్రయవసతి గృహంలో కడప తిరుమల టింబర్ డిపో అధినేత కంచి గోపికృష్ణ, శ్రీ సూర్య డెవలపర్స్ (హైదరాబాద్) అధినేత శ్రీ కంచి సురేంద్రనాథ్ (సూరి) సహకారంతో పేదలకు అన్నదాన కార్యక్రమం నిర్వహించారు. కార్యక్రమంలో శంకరాపురం అశోక్ కుమార్, వల్లి బాషా (బొమ్మ) మాజీ వార్డు సభ్యుడు భాస్కర్ రెడ్డి , మాధవరెడ్డి, శివశంకర్, పట్టణ నిరాశ్రయుల వసతి గృహ నిర్వాహకులు శ్రీనివాసులురెడ్డి పాల్గొన్నారు.

అన్నదానం చేస్తున్న చంద్రశేఖర్‌రెడ్డి

టిడిపిలో టికెట్ల టెన్షన్!

- పొత్తు పేరుతో కోల్పోయేదెవరో
- ఆ స్థానాల ఆశావహులకు ఝలక్?
- త్యాగానికి నేతలు ససేమిరా
- గందరగోళంలో కేడర్

టిడిపిలో టికెట్ల టెన్షన్ నెలకొంది. టిడిపి జాతీయ అధ్యక్షులు చంద్రబాబునాయుడు జనసేన, బిజెపిలతో పొత్తు కోసం వెంపర్లాడటం తలనొప్పికి కారణమని తెలస్తోంది. బిజెపితో పొత్తు కుదిరితే గెలిచే అవకాశాలు కలిగిన స్థానాలను మిత్రులకు వదులుకోవాల్సి రావడం తీవ్ర అసంతృప్తికి దారితీస్తోంది. ఉమ్మడి కడప జిల్లాలోని ఒక ఎంపీ, ఎమ్మెల్యే టికెట్లను త్యాంగం చేయాల్సి రావడంపై ఆశావహుల్లో అంతులేని నిర్వేదం నెలకొంది. ఐదేళ్లుగా అధికార వైసిపి నాయకుల చేతిలో ఈతిబాధలు అనుభవించిన కేడర్ మనో భావాలను సైతం గాలికి వదిలేయడం సర్వత్రా చర్చనీయాంశంగా మారింది.

ప్రజాశక్తి - కడప ప్రతినిధి

ఉమ్మడి జిల్లా టిడిపి నేతల్లో అంతర్మథనం నెలకొంది. 2024 సార్వత్రిక ఎన్నికల్లో అధికార వైసిపిని సమర్థంగా ఎదుర్కోవడానికి జనసేన, బిజెపి పొత్తు పెట్టుకోవడం అనివార్యమా అనే చర్చ నడుస్తోంది. ఇప్పటికే ఊరూపేరూ లేని జనసేన అభ్యర్థులకు, సంస్థాగతంగా ఎలాంటి బలంలేని బిజెపి అభ్యర్థులకు ఊడిగం చేయాల్సి రావడమేమిటనే వాదన వినిపిస్తోంది. బిజెపి పొత్తు కుదిరితే ఉమ్మడి కడప జిల్లాలోని రాజంపేట పార్లమెంట్, జమ్మల మడుగు అసెంబ్లీ టికెట్లు అడిగినట్లు వస్తున్న వార్తల నేపథ్యంలో ఆశావహుల్లో ఉలికి పాటు కనిపిస్తోంది. టిడిపి రాజంపేట పార్లమెంట్ టికెట్‌ను సుగవాసి బాలసుబ్రమణ్యానికి కేటాయించింది. 2014 సార్వత్రిక ఎన్నికల సమయంలో టిడిపి, బిజెపి పొత్తు పేరుతో రాజంపేట పార్లమెంట్ స్థానాన్ని బిజెపికి వదులుకున్న సంగతి తెలిసిందే. ప్రస్తుత బిజెపి రాష్ట్ర అధ్యక్షులు పురందేశ్వరి అప్పట్లో పోటీ చేసిన సంగతి తెలిసిందే. పదేళ్ల తర్వాత కేలెండర్ మళ్లీ గిర్రున తిరిగింది. 2024 సార్వత్రిక ఎన్నికల్లో పొత్తు కుదిరితే రాజంపేట పార్లమెంట్ స్థానాన్ని బిజెపికి కేటాయించనున్న నేపథ్యంలో ఆశావహుల్లో ఆందోళన నెలకొంది. అధికార వైసిపి అభ్యర్థి పి.మిథున్‌రెడ్డి ప్రజలకు అందుబాటులో ఉండని పరిస్థితుల్లో తీవ్ర వ్యతిరేకత వ్యక్తమవుతోంది. ఇటువంటి సానుకూల పరిస్థితుల్లో రాజంపేట పార్లమెంట్‌ను వదులుకోవడం సరికాదనే వాదన వినిపిస్తోంది.

గందరగోళానికి కేరాఫ్ జమ్మలమడుగు

జిల్లాలో జమ్మలమడుగుకు ప్రత్యేకతను కలిగి ఉంది. బిజెపితో పొత్తు కుదిరితే టికెట్‌ను వదులుకోవడానికి చంద్రబాబు సిద్ధపడడం కలవరాన్ని కలిగిస్తోంది. వారం రోజులుగా జమ్మల మడుగు, ప్రొద్దుటూరు నియోజకవర్గాల్లో బిజెపి అభ్యర్థిగా మాజీ మంత్రి ఆదినా రాయణరెడ్డి పోటీ చేస్తున్నారనే ఊహా గానాలతో టిడిపి నేతల్లో నిస్తేజం నెలకొంది. జమ్మలమడుగులో అభ్యర్థి భూపేష్‌రెడ్డి తనదైన శైలిలో ప్రచారం నిర్వహిస్తూ ప్రజల్లోకి చొచ్చుకెళ్లిన సంగతి తెలిసిందే. ఇటువంటి సమయంలో బిజెపికి టికెట్‌ను వదులుకోవాల్సి రావడం ఆశావహులు మొదలు కేడర్‌ను గండరగోళంలో పడేసింది. ఇంత చేసినా టిడిపి ఓట్లు బిజెపి వైపు మళ్లే అవకాశాలు తక్కువగా ఉన్నాయనే వాదన వినిపిస్తోంది.

కడప 'ఉక్కు'కు బిజెపి ద్రోహం

రాష్ట్ర విభజన చట్టంలో పేర్కొన్న హామీలైన కడపలో ఉక్కు పరిశ్రమ ఏర్పాటు హామీ అమలుకు బిజెపి కొర్రీలు వేసింది. రాష్ట్రానికి ప్రత్యేక హోదా మొదలుకుని వెనుకబడిన ప్రాంతాల ప్యాకేజీ, విశాఖ ఉక్కు ప్రయివేటీకరణ గ్రీన్‌సిగ్నల్ ఇవ్వడం, రైల్వేజోన్ కేటాయించకపోవడం, కడప-బెంగళూరు రైల్వేలైన్ పనులు నిలిపివేత వంటి సహాయ నిరాకరణ చేసిన బిజెపితో పొత్తును ఓటర్లు తిరస్కరించే అవకాశాలు ఎక్కువగా ఉన్నాయనే వాదన వినిపిస్తోంది. ఉమ్మడి కడప, కర్నూలు, అనంతపురం జిల్లాల్లో మైనార్టీలైన ముస్లిములు, క్రిస్టియన్లు దూరం కావడం నష్టదాయకమని చర్చించుకోవడం కనిపిస్తోంది.

'కాంట్రాక్టు'పై ఆగమేఘాలు

గ్రీవెన్స్ సమయంపై అభ్యంతరాలు
సర్టిఫికెట్ల పరిశీలనలో యంత్రాంగం

ప్రజాశక్తి - కడప ప్రతినిధి

కాంట్రాక్టు ఉద్యోగార్థుల సర్టిఫికెట్ల పరిశీలన ఆగమేఘాలపై నడుస్తోంది. ప్రభుత్వం రెండు నెలల కిందట జిల్లా ప్రభుత్వ వైద్య కళాశాల, మానసిక, కేన్సర్‌కేర్, పులివెందుల ప్రభుత్వ వైద్య కళాశాల పరిధిలోని 14 కేటగిరీలకు చెందిన 196 పోస్టులకు నోటిఫికేషన్ విడుదల చేసిన సంగతి తెలిసిందే. జిల్లా ప్రభుత్వ వైద్య కళాశాల యంత్రాంగం నోటిఫికేషన్ నుంచి భర్తీ ప్రక్రియ వరకు క్రియాశీలకంగా వ్యవహరించింది. రివైజ్డ్ ఫైనల్ లిస్టు పెట్టకుండా సెలెక్షన్ లిస్టు ప్రకటించడంపై విమర్శలు వెల్లువెత్తాయి. రిజర్వేషన్ల గుర్తింపు దగ్గర నుంచి, ఆయా పోస్టులకు అర్హతలు నిర్ధారించడం వరకు విఫలమైందనే ఆరోపణలు వెల్లువెత్తాయి. ఇటువంటి తప్పిదాలను సవరించాలని కోరుతూ జిల్లా ప్రభుత్వ సర్వజన ఆస్పత్రి కళాశాల ఎదుట పలువురు ఉద్యోగార్థులు ఆందోళన చేశారు. రివైజ్డ్ ఫైనల్ లిస్టు ప్రకటన అనంతరం పోస్టులను భర్తీ చేయాలని, తప్పులను సవరించిన తర్వాత ముందుకెళ్లాలని డిమాండ్ వినిపించింది. రిక్రూట్‌మెంట్ అవకతవకల వ్యవహారం పతాకస్థాయికి చేరుకుంది. కలెక్టర్ స్పందించి రీవెర్ఫికేషన్ చేయడానికి ఏర్పాట్లు చేశారు. దీనిపై జిల్లాకు చెందిన పలు శాఖలకు చెందిన ఉన్నతాధికారులు సర్టిఫికెట్ల పరిశీలనకు నియమించారు. సదరు అధికార యంత్రాంగం సర్టిఫికెట్ల పరిశీలన ప్రక్రియను ఆగమేఘాలపై చేపట్టడం విశేషం. మహాశివరాత్రి సెలవు సహా మరో రెండు రోజులు సెలవు రోజుల్లోనూ వెర్ఫికేషన్ ప్రక్రియను కొనసాగిస్తోంది. దీనిపై పలువురు అభ్యంతరాలు వ్యక్తం చేస్తున్నారు. ఏమైనా గ్రీవెన్స్ ఉంటే ఎవరికి చెప్పుకోవాలో ఎలా తెలుస్తుందని ప్రశ్నిస్తున్నారు. గ్రీవెన్స్ సమయం ఇచ్చిన తరువాత వెర్ఫి కేషన్ చేపడితే పారదర్శకతకు అవకాశం ఉంటుందనే వాదనవినిపిస్తోంది.

గ్రీవెన్స్‌కు అవకాశం ఇవ్వండి

కాంట్రాక్టు ఉద్యోగాల భర్తీ ప్రక్రియలో చోటుచేసుకున్న అలసత్వానికి కారకులైన వారిపై చర్యలు తీసుకోవాలి. వరుస సెలవుల్లో ఆగమే ఘాలపై వెర్ఫికేషన్ ప్రక్రియను నిర్వహిస్తే ఇతరుల అభ్యం తరాలను స్వీకరించడం ఎలా సాధ్యం. భర్తీ ప్రక్రియలో అన్యాయానికి గురైన ఉద్యోగార్థులు మరి కొందరు ఉండే అవకాశం ఉంది. ఇటువంటి వారి సమస్యల్ని పరిష్కరించేందుకు గ్రీవెన్స్‌కు సమయం ఇవ్వాలి.

- బి.మనోహర్, రిమ్స్ మెడికల్ యూనియన్ గౌరవాధ్యక్షులు. కడప.

విద్యాశాఖలో వింత పోకడలు

- చీఫ్ సూపరింటెండెంట్లు, డిపార్ట్‌మెంట్ ఆఫీసర్ల మార్పుల్లో గందరగోళం
- మార్పులపై ఉపాధ్యాయుల అసహనం

ప్రజాశక్తి - కడప అర్బన్

రాష్ట్రవ్యాప్తంగా పదవ తరగతి పరీక్షలు ఈ నెల 18 నుంచి ప్రారంభం కానున్నాయి. కడప జిల్లాలో దాదాపు 153 పరీక్ష కేంద్రాలలో పదో తరగతి పరీక్షలు నిర్వహిస్తున్నారు. ఇందులో భాగంగా పరీక్షలు నిర్వహించడానికి జిల్లా విద్యాశాఖ అధికారి చీఫ్ సూపరింటెండెంట్‌లు, డిపార్టుమెంటు ఆఫీసర్లను నియమించారు. వీరికి జిల్లా పరిషత్ సమావేశ మందిరంలో ఒకరోజు శిక్షణ కూడా ఇచ్చారు. పదో తరగతి హాల్ టికెట్లు ఈ నెల 4 నుంచి విద్యార్థులు డౌన్లోడ్ చేసుకునే విధంగా ప్రభుత్వం అవకాశం కల్పించింది. సాధారణంగా చీఫ్ సూపరింటెండెంట్‌లు, డిపార్ట్‌మెంట్ ఆఫీసర్లుగా నియమింపబడిన వారిలో ఎవరైనా అనారోగ్య పరిస్థితుల కారణంగా కానీ, వ్యక్తిగత సమస్యల నుంచి కానీ మినహాయింపు కోరితే, వారికి మినహాయింపు ఇచ్చి వారి స్థానంలో వేరే వారిని నియమిస్తారు. అయితే పదో తరగతి విద్యార్థులు 4వ తేదీ నుంచి హాల్ టికెట్లు డౌన్లోడ్ చేసుకోవడం, 5వ తేదీ చీఫ్ సూపరింటెండెంట్‌లు, డిపార్ట్మెంట్ ఆఫీసర్లను ఇష్టం వచ్చిన రీతిలో ఒక సెంటర్ నుంచి మరొక సెంటర్ మార్చడం వెనుక అంత్యమేమిటని పలువురు ప్రశ్నిస్తున్నారు. తమకు సెంటర్లు మార్చమని విన్నవించుకోనప్పటికీ ఒక సెంటర్ నుంచి వేరొక సెంటర్‌కు, ఆ సెంటర్ నుంచి వేరొకరిని మరొక సెంటర్‌కు మార్చడం వెనుక ఉన్న ఆంతర్యం ఏమిటని అంతుపట్టడం లేదు. ఇలా మార్చాల్సిన అవసరం ఏముందని జిల్లా విద్యాశాఖలో పలువురు ఉపాధ్యాయులు చర్చించుకుంటున్నారు. తమ (ప్రయివేట్) విద్యార్థులకు అనుగుణంగా ప్రవర్తించే ఉపాధ్యాయులను ఎన్నుకుని చీఫ్ సూపరింటెండెంట్, డిపార్ట్‌మెంట్ ఆఫీసర్లను మార్చారన్నది బహిరంగ రహస్యం. ఒక సెంటర్‌లో అయితే చీఫ్ సూపరింటెండెంట్‌ను, డిపార్ట్‌మెంట్ ఆఫీసర్‌ను ఇద్దరినీ మార్చి, ఆ ఇద్దరినీ మళ్లీ వేరొక సెంటర్‌కు మార్చడం వివాదాస్పదంగా ఉంది. దీని వెనక ఎవరున్నారు, ఎవరికి ప్రయోజనం చేకూర్చడానికి ఇటువంటి వివాదాస్పద నిర్ణయం తీసుకున్నారని పలువురు చర్చించుకుంటున్నారు. అనేక సెంటర్లలో జిల్లా వ్యాప్తంగా ముఖ్యంగా కడప నగరంలో ఈ విధంగా పరీక్షా కేంద్రానికి పూర్తి బాధ్యులైన చీఫ్‌లను, డిపార్ట్‌మెంట్ ఆఫీసర్లను మార్చడం పలు అనుమానాలకు తావిసుంది. ఎవరో కావాలని ఇదంతా చేస్తున్నట్టు ఉందనీ, ఎవరి ప్రయోజనాల కోసం చేస్తున్నారని పలువురు చర్చించుకుంటున్నారు. పదవ తరగతి పరీక్షలలో ఇటువంటి వివాదాస్పద నిర్ణయాలను తీసుకోకుండా సవ్యంగా పరీక్షలు జరపాలని విద్యా శాఖలో పలువురు కోరుకుంటున్నారు.

కడప నగరాన్ని అన్ని విధాలా అభివృద్ధి చేస్తున్నాం

-డిప్యూటీ సిఎం అంజాద్‌బాషా

ప్రజాశక్తి - కడప

కడప నగరాన్ని అన్ని విధాలా అభివృద్ధి చేస్తున్నామని డిప్యూటీ సిఎం అంజాద్‌బాషా పేర్కొన్నారు. నగరంలోని కార్పొరేటర్ మహమ్మద్ రఫీ ఆధ్వర్యంలో మౌలానా అబుల్ కలాం ఆజాద్ పార్కును పార్కును, రిమ్స్ ఆస్పత్రి దగ్గరలోని జర్నలిస్ట్ కాలనీ వద్ద కార్పొరేటర్ ప్రసాద్‌రెడ్డి ఆధ్వర్యంలో పార్కును ఉపముఖ్యమంత్రి ఎస్.బి అంజాద్‌బాషా శుక్రవారం ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ దేశంలో ఎక్కడా లేనివిధంగా రాష్ట్రంలో ముఖ్యమంత్రి జగన్మోహన్ రెడ్డి ప్రభుత్వంలో అభివృద్ధి కార్యక్రమాలు జరుగుతున్నాయని చెప్పారు. ఆ దిశగా కడప నగరంలో సుందరీకరణ భాగంగా కడప నగరాన్ని అన్ని విధాలా అభివృద్ధి చేస్తున్నామని చెప్పారు. రూ.60 లక్షల అంచనా వ్యయంతో మౌలానా అబుల్ కలాం ఆజాద్ పార్క్ ను, రూ.1.30 కోట్ల అంచనా వ్యయంతో జర్నలిస్టుల కాలనీ వద్ద పార్కు ప్రారంభించామని చెప్పారు. కార్యక్రమంలో డిప్యూటీ మేయర్ ముంతాజ్ బేగం కార్పొరేటర్లు మహమ్మద్ రఫీ, ప్రసాద్ రెడ్డి, త్యాగరాజు, అజ్మతుల్లా ఖాన్, అక్బర్ అలీ, మున్సిపల్ అడిషనల్ కమిషనర్ రాకేష్ చంద్ర, డిఇ కరిముల్లా, నాయకులు నారపరెడ్డి సుబ్బారెడ్డి, తోట కృష్ణ, బంగారు నాగయ్య యాదవ్, చాక్లెట్ గౌస్, జమాల్ భాష, రమేష్ రెడ్డి, ఇతర నాయకులు పాల్గొన్నారు.

పార్కు ప్రారంభోత్సవంలో డిప్యూటీ సిఎం అంజాద్‌బాషా

మతతత్వ పార్టీలను తరిమికొట్టండి

- సంఘ సేవకులు సయ్యద్ సలావుద్దీన్

ప్రజాశక్తి - కడప అర్బన్

రాష్ట్రం అభివృద్ధి చెందాలన్నా, రాష్ట్రానికి ప్రత్యేక హోదా రావాలన్నా, శాంతిభద్రతలు కాపాడాలన్నా అది కాంగ్రెస్ పార్టీ తోనే సాధ్యమని కాంగ్రెస్ పార్టీ నాయకులు, సంఘ సేవకులు సయ్యద్ సలావుద్దీన్ పేర్కొన్నారు. కాంగ్రెస్ పార్టీ తరపున ప్రచారంలో భాగంగా శుక్రవారం నగరంలోని యాకూబ్ సాబ్ మజీద్ వద్ద కాంగ్రెస్ పార్టీ కరపత్రాల పంపిణీ కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ నేటి పరిస్థితులలో కేంద్రంలో, రాష్ట్రంలో సెక్యులర్ పార్టీ అయినా కాంగ్రెస్ ప్రభుత్వ రావాలసిన అవసరం ఎంతైనా ఉందని అన్నారు. పది సంవత్సరాలుగా బిజెపి, జగన్ ప్రభుత్వాలతో దేశ, రాష్ట్ర ప్రజలు ఎన్నో అరాచకాలకు, దౌర్జన్యాలకు గురి అయ్యారని చెప్పారు. వారి కబంధ హస్తాల నుంచి దేశాన్ని, రాష్ట్రాన్ని కాపాడాలంటే ప్రతి ఒక్కరూ 2024లో జరిగే సార్వత్రిక ఎన్నికలలో కాంగ్రెస్ పార్టీని గెలిపించడమే లక్ష్యంగా ముందుకు సాగాలని పిలుపునిచ్చారు. అధిష్టానం తాను చేసిన సంఘ సేవ, అభివృద్ధి కార్యక్రమాలను చూసి తనకే కడప అసెంబ్లీ టికెట్ కేటాయిస్తుందని ధీమా వ్యక్తం చేశారు.

కరపత్రాలు పంచుతున్న సలావుద్దీన్

అన్ని వర్గాలకూ సంక్షేమ పథకాలు

ప్రజాశక్తి-కడప అర్బన్

ప్రభుత్వ వ్యతిరేకత స్పష్టంగా కనపడుతుంటే ప్రజలను వాలంటీలర్ల ద్వారా వైసిపి ప్రభుత్వం మభ్యపెడుతూ ఉందని, టిడిపి అధికారంలోకి వస్తే అన్ని వర్గాలకూ సంక్షేమ పథకాలు అమలు చేస్తుందని ఆ పార్టీ జిల్లా అధికార ప్రతినిధి మన్నూర్ అక్బర్ అన్నారు. శుక్రవారం పాత బస్టాండ్ లోని ఆయన కార్యాలయంలో విలేకరుల సమావేశం నిర్వహించారు. వాలంటీర్లీ ప్రజల ఇంటి దగ్గరకు పోయి వైసిపి కి ఓటు వేస్తేనే పథకాలు వస్తాయని చెప్పిస్తున్నారని వీటిని నమ్మవద్దన్నారు. తెలుగుదేశం ప్రభుత్వం అధికారంలోకి వస్తానే సూపర్ సిక్స్ పథకాలు ప్రతి ఇంటికి అందజేస్తా మన్నారు. అందులో మహిళకు, నిరుద్యో గులు, యువత, రైతులు, బిసిలకు ఈ ప్రభుత్వం కంటే ఎక్కువ సంక్షేమ కార్య క్రమాలు అందు తాయన్నారు. వాలంటీర్లు ఎదుగుదల లేకుండా రూ.5 వేల జీతంతో బానిసలుగా చేసి ఆడు కుంటున్నారని పేర్కొన్నారు. సమావేశంలో మైనారిటీ నాయకులు రూపన గుడి హుస్సేన్, ప్రొద్దుటూరు నజీర్ పాల్గొన్నారు.

మాట్లాడుతున్న మన్నూరు అక్బర్

కాంగ్రెస్ పార్టీ అధికార ప్రతినిధిగా నజీర్

ప్రజాశక్తి-ప్రొద్దుటూరు

కాంగ్రెస్‌పార్టీ రాష్ట్ర అధికార ప్రతినిధిగా ప్రొద్దుటూరుకు చెందిన పూల నజీర్ అహ్మద్ నియమితులయ్యారు. ఈ సందర్భంగా ఆయన శుక్రవారం విలేకరులతో మాట్లాడుతూ తన నియామకానికి సహకరించిన రాష్ట్ర ఇన్‌ఛార్జి మాణిక్యం ఠాగూర్‌కు, పిసిసి అధ్యక్షురాలు షర్మిలకు రాష్ట్ర మీడియా ఛైర్మెన్ తులసిరెడ్డికి, ఏఐసిసి సభ్యులు రఘువీరారెడ్డికి కృతజ్ఞతలు తెలిపారు. తనపై నమ్మకంతో ఇచ్చిన పదవికి న్యాయం చేస్తానన్నారు. తొలి నుండి తాను కాంగ్రెస్‌పార్టీలో ఉన్నానని. కాంగ్రెస్‌పార్టీ విజయానికి తన శక్తివంచనలేకుండా కృషి చేస్తానని ఆయన చెప్పారు.

చలివేంద్రాన్ని ప్రారంభిస్తున్న డిపో మేనేజర్ శ్రీనివాసులరావు

చలివేంద్రం ఏర్పాటు అభినందనీయం

ప్రజాశక్తి- పోరుమామిళ్ల

పట్టణంలోని బస్టాండు ఆవరణంలో ఐదేళ్లుగా ఉచిత కూలింగ్ మినరల్ వాటర్ చలివేంద్రాన్ని వెంకటరమణ సహకారంతో ఉపాధ్యాయుడు శ్రీనివాసులు ఆధ్వర్యంలో ఏర్పాటు చేయడం ఆనందదాయకంగా ఉందని ఆర్‌టిపి డిపో మేనేజర్ శ్రీనివాసుల రావు పేర్కొన్నారు. ప్రజలు, విద్యార్థుల దాహార్తిని తీర్చేందుకు చలివేంద్రాన్ని ఏర్పాటు చేసినట్లు ఉపాధ్యాయులు శ్రీనివాసులు తెలిపారు. ఐదు సంవత్సరాలుగా చలి వేంద్రం ఏర్పాటు చేస్తున్న ఉపాధ్యాయడు శ్రీనివాసులును స్థానికులు అభినందించారు. కార్యక్రమంలో రాష్ట్ర అదనపు ప్రధాన కార్యదర్శి రమణా రెడ్డి, ప్రముఖ దంత వైద్యులు సునీల్ కుమార్ రెడ్డి, బోస్, వెంగమాంబ పాఠశాల కరస్పాండెంట్ పుల్లపు నాయుడు, ఉపాధ్యాయులు పాల్గొన్నారు. **చక్రాయపేటలో..** ఎండల తీవ్రత దృష్టిలో పెట్టుకుని స్థానిక ఎంపిటిసి ఇందుకూరి లీలావతి, మానవతా సంస్థ చైర్మెన్ కందుకూరు శ్రీనివాసులు ఆధ్వర్యంలో శుక్రవారం మండల ఇన్‌ఛార్జి వై.ఎస్ కొండా రెడ్డి చేతుల మీదుగా చలివెందుల ప్రారంభించారు. ప్రయాణికులు ఈ సౌకర్యాన్ని సద్వినియోగం చేసుకోవాలని వారు తెలిపారు. కార్యక్రమంలో వైసిపి కాంగ్రెస్ పార్టీ కార్యకర్తలు, అభిమానులు, నాయకులు, గ్రామస్తులు పాల్గొన్నారు.

ఆయూష్ ఉచిత వైద్య శిబిరం ప్రారంభం

ప్రజాశక్తి - వేంపల్లె

శివరాత్రి సందర్భంగా ప్రజలు వడ దెబ్బకు లోను కాకుండా ఏర్పాటు చేసిన ఆయూష్ ఉచిత వైద్య శిబిరాన్ని పిసిసి మీడియా చైర్మన్ నర్రెడ్డి తులసిరెడ్డి ప్రారభించారు. స్థానిక ప్రభుత్వ వైద్య విధాన పరిషత్ (ప్రభుత్వ ఆసుపత్రి) ఆధ్వర్యంలో పాతపేటలోని నీలకంఠటేశ్వర స్వామి దేవస్థానంలో ఆయూష్ వైద్య శిబిరాన్ని ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా తులసిరెడ్డి ప్రజలకు మందులు పంపిణీ చేశారు. వడ దెబ్బకు గురి కాకుండా భక్తులు జాగ్రత్తలు తీసుకోవాలని సూచించారు. కార్యక్రమంలో ప్రభుత్వ వైద్యుడు వైద్యనాథ్, ఆరోగ్య కార్యకర్తలు ఇందిరా, కల్పన, కాంగ్రెస్ నాయకులు ధృవకుమార్ రెడ్డి, అమర్, ఉత్తన్న, రామకృష్ణ, నరసింహరెడ్డి, సుబ్రమణ్యం, వెంకటేష్, బాలం సుబ్బరాయుడు, రాజా ,వినయ్, బద్రి పాల్గొన్నారు.

కిసాన్ రైలు పునరుద్ధరణ అయ్యేనా..!

టన్నుపై రైతుకు అదనంగా రూ.నాలుగు నుంచి ఐదు వేలు ఆదాయం పొందే అవకాశం- ప్రజాప్రతినిధులు, అధికారులు స్పందించాలని వేడుకోలు

ఢిల్లీ మార్కెట్‌కు తరలించడానికి లారీలో లోడ్ చేస్తున్న అరటికాయలు

ప్రజాశక్తి - సింహాద్రిపురం

కేంద్ర ప్రభుత్వం రైతులు పండించిన ఉత్పత్తులను తక్కువ ఖర్చుతో ఢిల్లీలోని ఆజాద్‌పూర్ మండీకి రైలు సౌకర్యాన్ని ఏర్పాటు చేశారు. 2020లో అనంతపురం నుంచి ఢిల్లీ మార్కెట్‌కు రైల్ పోయే విధంగా రూపకల్పన చేశారు. ఈ రైలు అనంతపురం నుంచి ఢిల్లీకి కేవలం 36 గంటల సమయంలో వెళ్లేది. అప్పట్లో రైతులు అనంతపురం నుంచి అరటికాయలు, వేరుశనగ, చీనీ కాయలను రైల్లో తీసుకెళ్లి ఢిల్లీ మార్కెట్లో విక్రయించుకునేవారు. ఇక్కడి ధరలకు ఢిల్లీలోని ఆజాద్‌పూర్ మండీలో ధరలకు చాలా వ్యత్యాసం ఉందని.. ఈ మార్కెట్ ఎంతో ఉపయోగకరంగా ఉంటుందని అప్పట్లో రైతులు భావించేవారు. అనంతరం 8 నెలల తర్వాత ప్రభుత్వం కొన్ని అనివార్య కారణాల వల్ల రైలును రద్దు చేసింది. అప్పటినుండి నేటికీ పునరుద్ధరణకు నోచుకోలేదు. ఆరుగాలం శ్రమించి పంట పండించి.. దిగుబడి వచ్చే సమయంలో ధరలు నిలకడగా లేని కారణంగా తీవ్రంగా నష్టపోతున్నామని రైతులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. కిసాన్ రైలు ఉంటే తక్కువ ఖర్చుతో ఢిల్లీ మార్కెట్‌కు పంట ఉత్పత్తులను తరలించి అమ్ముకుని లాభపడేవారని పేర్కొంటున్నారు. పండ్ల తోటలకు కడప, అనంతపురం జిల్లాలు ప్రసిద్ధి. కడప జిల్లాలోని పులివెందుల నియోజవర్గంలో అరటి, చీనీకాయలు ఎక్కువ రోజులు మన్నికతోపాటు, నాణ్యత సైతం బాగా ఉంటాయి. ఈ కారణంగా ఇతర రాష్ట్రాలతోపాటు దేశాల్లో కూడా వీటికి మంచి డిమాండ్ ఉంది.

లారీల్లో రవాణాతో నష్టపోతున్న రైతులు..

పులివెందుల నియోజవర్గంలో అరటి, చీనీ కాయలను లారీల్లో ఢిల్లీ, ఉత్తరప్రదేశ్, రాజస్థాన్, జమ్ముకాశ్మీర్ రాష్ట్రాలకు తరలిస్తున్నారు. ముఖ్యంగా సీజన్‌లో అరటికాయలు రోజు 22 టన్నుల సామర్థ్యం కలిగిన దాదాపు 50 లారీల్లో ఢిల్లీ, ఇతర రాష్ట్రాలకు తరలిస్తున్నారు. అరటికాయలు రవాణా చేసేందుకు టన్నుకు రూ.8 వేలు చెల్లించాల్సి ఉంది. అంతేకాక సమయం కూడా నాలుగు రోజులు పడుతుంది. అదేవిధంగా చీనీ కాయలు సైతం నియోజవర్గంలోని సింహాద్రిపురం, లింగాల, పులివెందుల, వేముల మండలాలతోపాటు కొండాపురం మండలం నుంచి ఢిల్లీ మార్కెట్‌కు వ్యాపారులు స్థానిక తోటల వద్దకు వచ్చి కొనుగోలు చేసి రవాణా చేస్తుంటారు. లారీల్లో రవాణా కారణంగా సమయం ఎక్కువ, బాడుగ అధికంగా చెల్లించాల్సి వస్తుందని రైతులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఈ పరిస్థితుల్లో కిసాన్ రైలు అందుబాటులో ఉండి ఉంటే.. తక్కువ ఖర్చుతో తమ ఉత్పత్తులను ఢిల్లీ మార్కెట్లో అమ్ముకుని అదనపు ఆదాయం పొందేవారమని రైతులు, రైతు సంఘ నాయకులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. రవాణా ద్వారా రైతులకు అదనపు ఆదాయం వస్తున్నందున పాలకులు, అధికారులు చర్యలు తీసుకొని కిసాన్ రైల్ పునరుద్ధరణ చేయాలని రైతు సంఘాల నాయకులు కోరుతున్నారు.

లారీల్లో రవాణా వల్ల నష్టపోతున్నాం..

అరటికాయలను లారీల్లో ఢిల్లీ ప్రాంతానికి ఎగుమతి చేయడం వల్ల రవాణా ఖర్చులు పెరుగు తున్నాయి. రవాణా ఖర్చు టన్నుకు రూ8 వేలు. ఆ మేరకు తోటల వద్ద ధరలు తగ్గించి వ్యాపారస్తులు కొనుగోలు చేస్తున్నారు. అదే రైలు సౌకర్యం ఉంటే రవాణా ఖర్చు తగ్గి అదనపు ఆదాయం వచ్చేది.

- బాలనాగిరెడ్డి, అరటి రైతు, గురజాల

రైలు పునరుద్ధరణను సిఎం దృష్టికి తీసుకెళ్తా..

పండ్ల తోటల రైతులకు ఎంతో ఉప యోగకరంగా ఉండే కిసాన్ రైలు రద్దు చేయడం చాలా అన్యాయం. రైలు పునరుద్ధరణ కోసం సీఎం వైఎస్ జగన్మోహన్‌రెడ్డి దృష్టికి తీసుకెళ్తా. లారీల్లో రవాణా కార ణంగా జరిగే నష్టాన్ని సీఎంకు వివరించి పునరుద్ధరణకు చర్యలు తీసుకుంటాం.

- వి.అరవిందనాథ్‌రెడ్డి, వైసిపి రైతు విభాగ నాయకుడు, సింహాద్రిపురం

సమావేశంలో మాట్లాడుతున్న తులసిరెడ్డి

వైసిపి పాలనలో మహిళలకు రక్షణ కరువు

- పిసిసి మీడియా చైర్మన్ తులసిరెడ్డి

ప్రజాశక్తి - వేంపల్లె

వైసిపి పాలనలో మహిళలకు రక్షణ లేకుండా పోయిందని పిసిసి మీడియా చైర్మన్ తులసిరెడ్డి అన్నారు. శుక్రవారం వేంపల్లెలో ఆయన విలేకరులతో మాట్లాడుతూ మహిళ సాధికారత కాంగ్రెస్ పార్టీతోనే సాధ్యం అవుతుందనే చెప్పారు. కాంగ్రెసు పార్టీ మొదటి నుంచి మహిళ సాధికారతకు పెద్ద పీట వేస్తున్నట్లు చెప్పారు. అనిబ్ సెంట్, సరోజినినాయుడు, ఇందిరాగాంధీ, సోనియాగాంధీలు పార్టీలో అత్యున్నతమైన ఎఐసిసి అధ్యక్ష పదవులు అలకరించినట్లు చెప్పారు. ప్రతిభా పాటిల్ రాష్ట్రపతిగా, ఇందిరమ్మ ప్రధానిగా, మీరా కుమార్ లోక్ సభ స్పీకర్‌గా ఉన్నత పదవులు అలంకరించారని పేర్కొన్నారు. మహిళ రాజకీయ, సాంఘిక ఆర్థిక సాధికారత కోసం కాంగ్రెస్ ఎంతో కృషి చేసిందని చెప్పారు. బాలింతలకు, గర్భిణులు, బాల బాలికల పౌష్టికాహారం లోప నివారణ కోసం 1975లోనే అంగన్వాడీలను ఏర్పాటు చేసిందని చెప్పారు. మహిళా ఆర్థిక స్వావలంబన కోసం డ్వాక్రా పథకాన్ని, పావలా వడ్డీ, సున్నా వడ్డీ, స్త్రీ నిధి పథకాలను ప్రవేశ పెట్టి మహిళాలను మహారాణులుగా చేసిందని చెప్పారు. స్థానిక సంస్థల్లో రిజర్వేషన్లు కల్పించి లక్షాలాది మంది మహిళలను సర్పంచులు, చైర్మన్లు, మేయర్లుగా చేసిందని చెప్పారు. బాలికల బంగారు భవిష్యత్తు కోసం బంగారు తల్లి పథకం, గృహిణిల కోసం అమ్మ హస్తం పథకాన్ని కాంగ్రెస్ ప్రభుత్వం అమలు చేసిందని చెప్పారు. దురదృష్టవశాత్తు వైసిపి ప్రభుత్వ పాలనలో మహిళల పట్ల వివక్ష కొనసాగుతున్నట్లు చెప్పారు. అమ్మహస్తం, బంగారు తల్లి పథకాలను రద్దు చేసిందని చెప్పారు. డ్వాక్రా మహిళల సంఘాలకు సున్నా వడ్డీ పథకాన్ని రూ 5 లక్షల నుండి రూ 3లక్షలకు తగ్గించడం జరిగిందని చెప్పారు. రాష్ట్రంలో మద్యం ఏరులై పారుతున్నట్లు చెప్పారు. తాళిబొట్లు తాకట్టు పెట్టుతున్నట్లు చెప్పారు. కాంగ్రెస్ పార్టీ అధికారంలోకి వస్తే బంగారు తల్లి, అమ్మ హస్తం పథకాలను పునరుద్ధరణ చేస్తామని తులసిరెడ్డి చెప్పారు. అనంతరం మహిళా దినోత్సవం సందర్భంగా ఐసిడిఎస్ సూపర్ వైజర్ స్వర్ణలత, అంగన్వాడీ టీచర్లు శైలజా, ధనలక్ష్మి, భాగ్యలక్ష్మి, రమాదేవిలను కాంగ్రెస్ నాయకులు ఘనంగా సత్కరించారు. కార్యక్రమంలో ఎన్‌యుఎస్ఐ రాష్ట్ర ఉపాధ్యక్షులు ధ్రువకుమార్ రెడ్డి, సుబ్రమణ్యం, రామకృష్ణ, రాజా, నరసింహారెడ్డి, ఉత్తన్న, వినయ్, బాలం సుబ్బరాయుడు, బద్రి, రాఘవయ్య, వెంకటేష్ పాల్గొన్నారు.

పుస్తకాన్ని ఆవిష్కరిస్తున్న మైదుకూరు ఎమ్మెల్యే ఎస్.రఘురామిరెడ్డి

'ఇరగంరెడ్డి'కి సాటిలేరు : ఎమ్మెల్యే

ప్రజాశక్తి - దువ్వూరు

మండల పరిధిలోని పుల్లారెడ్డిపేటలో ఉన్న తిరుమల తిరుపతి దేవస్థానం కళ్యాణ మండపంలో దువ్వూరు సీమలో ఇరగం రెడ్డి అనే పుస్తకం ఆవిష్కరణ నిర్వహించారు. మైదుకూరు ఎమ్మెల్యే రఘురాం రెడ్డి ముఖ్యఅతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, మండలంలో ఇరగంరెడ్డి అనే పదానికి ఎవరు సాటి లేరని ఆయన అన్నారు. ఇరగం రెడ్డి తిరుపాలురెడ్డి, ఆయన జీవిత చరిత్ర పుస్తకం డాక్టర్ తవ్వ వెంకటసుబ్బయ్య రచించడం అభినందనీయమన్నారు. ఇరగరంరెడ్డి చేసిన మంచి పనులలో ఎక్కువగా దూరప్రాంత విద్యార్థులకు పుల్లారెడ్డిపేటలో ఒక జడ్పీ హై స్కూలు, జూనియర్ కాలేజీ, డిగ్రీ కాలేజీ, నిర్మించడమేననిచెప్పారు. కస్తూరిబాకు ఉచితంగా ఇవ్వడం స్థలం ఇచ్చారన్నారు. ఇలా చెప్పుకుంటూ పోతే ఎంతో ఉందని అని అన్నారు. కార్యక్రమంలో ఎమ్మెల్సీ రమేష్ యాదవ్, మల్లెల ఝాన్సీ రాణి, పలువురు ప్రముఖులు కవులు పాల్గొన్నారు. **డిసిసిబి భవనానికి శంకుస్థాపన..** పట్టణంలోని తహాశీల్దార్ కార్యాలయ సమీపంలో ఏర్పాటు చేయబోయే డిసిసిబి శాశ్వత భవనానికి అప్కోబ్ ఛైర్మెన్ మల్లెల ఝాన్సీరాణి టెంకాయ కొట్టి భూమి పూజ చేశారు.. డిసిసిబి మాజీ చైర్మన్ తిరుపాల్ రెడ్డి జీవితం పుస్తక ఆవిష్కరణ రోజు భూమి పూజ చేయడం విశేషమని ఆమె అన్నారు. కార్యక్రమంలో మైదుకూరు ఎమ్మెల్యే రఘురామి రెడ్డి, ఎమ్మెల్సీ రమేష్ యాదవ్ డిసిసి బ్యాంకు మేనేజర్ సుబ్బారెడ్డి సిబ్బంది పాల్గొన్నారు.

రక్తదానం చేయండి

ప్రజాశక్తి - చక్రాయపేట

అన్ని దానాల కన్నా అన్నదానం గొప్పది ఎలాగో అలాగే రక్తదానం చేసి ఇతరుల ప్రాణాలు కాపాడాలని ట్రిపుల్ ఐటీ తుపాకుల వెంకటప్రసాద్ పేర్కొన్నారు. శుక్రవారం చక్రయపేటలో నిర్వహించిన మహాశివరాత్రి ఉత్సవాల్లో పాల్గొన్న ప్రజలు దాదాపు 30 మంది దాతలు రక్తదానం అందించినట్లు వారు తెలిపారు. కార్యక్రమంలో సామాజిక ఆరోగ్య కేంద్రం సహకారంతో ప్రొద్దుటూరు జిల్లా ఆసుపత్రి సిబ్బంది, మైదుకూరు ఆస్పత్రి సిబ్బంది ఆనంద్ రెడ్డి, ఖలీల్ బాషా, శివరాజ్, పుల్లయ్య పాల్గొన్నారు.

సతీష్‌రెడ్డిని కలిసిన నాయకులు

ప్రజాశక్తి - లింగాల

మండలంలోని వైసిపి నాయకులు శుక్రవారం వేంపల్లిలో ఎస్.వి సతీష్ కుమార్‌రెడ్డిని కలిశారు. ఈ సందర్భంగా కడప పార్లమెంటరీ సెక్రెటరీ చంద్రశేఖర్ రెడ్డి సతీష్ రెడ్డినిశాలువా పుష్పగుచ్ఛంతో సత్కరించారు. అనంతరం సతీష్ రెడ్డితో వారు మాట్లాడుతూ తమ మండల నాయకుల కోరిక మేరకు లింగాల మండలానికి రావాలని కోరారు. సమయం తీసుకొని తప్పకుండా మండలానికి వచ్చి అందరిని కలుస్తానని సతీష్ రెడ్డి తెలిపారు. కార్యక్రమంలో రామలింగారెడ్డి మాజీ సర్పంచ్ అనిల్ లోకేశ్వర్ రెడ్డి రామకృష్ణారెడ్డి పాల్గొన్నారు.

రానున్న ఎన్నికల్లో టిడిపి గెలుపు తథ్యం

ప్రజాశక్తి -ఖాజీపేట

రానున్న ఎన్నికల్లో టిడిపి గెలుపు తథ్యమని, ప్రతి ఒక్కరూ చిత్త శుద్ధితో పని చేయాలని మైదుకూరు నియోజకవర్గం ఇన్‌ఛార్జి పుట్టా సుధాకర్ యాదవ్ అన్నారు. శుక్రవారం స్థానిక టీచర్స్ కాలనీకి చెందిన వైసిపి ముస్లిం మైనారిటీ నాయకులు అర్షద్‌తో పాటు ఆయన అనుచర వర్గం టిడిపిలో చేరారు. ఈ సందర్భంగా పుట్టా సుధాకర్ యాదవ్, టిడిపి మండలం కన్వీనర్ లక్ష్మిరెడ్డి టిడిపి కండువా వేసి పార్టీలోకి సాధరంగా ఆహ్వానం పలికారు. ఈ సందర్భంగా పుట్టా సుధాకర్ యాదవ్ మాట్లాడుతూ రానున్న ఎన్నికల్లో తనను గెలిపించాలని మైదుకూరు నియోజకవర్గ అభివృద్ధికి కృషి చేస్తానన్నారు. కార్యకర్తలకు ఎటువంటి కష్టం వచ్చినా అన్ని విధాలా ఆదు కుంటానన్నారు. కార్యక్రమంలో జనసేన నియోజకవర్గ ఇన్‌ఛార్జి మల్హోత్రా, మండల సీనియర్ నాయకులు సందుల నాగ శివారెడ్డి, రాష్ట్ర మైనారిటీ నాయకులు ఖాదీరుల్లా, పత్తూరు ఉప సర్పంచ్ ముత్తూరు రమణ, క్లస్టర్ ఇన్‌ఛార్జి సరిటాల వీరయ్య, హరినాథ్ రెడ్డి, పుల్లయ్య నాయుడు, జానకి రామ్ నాయుడు, కమలాపురం ఫరూక్, జలీల్ అహ్మద్, జండాల మహబూబ్ బాషా, పిచ్చి నాయుడు, ఎంపిటిసి భాస్కర్ రెడ్డి, గంగిరెడ్డి చిన్న, ఐటిడిపి మండల అధ్యక్షులు పాపాన మల్లికార్జునరెడ్డి పాల్గొన్నారు.

టిడిపి కండువా కప్పి పార్టీలోకి ఆహ్వానిస్తున్న పుట్టా సుధాకర్‌యాదవ్

రూ.లక్షలు ఖర్చు చేసి నిర్మించారు.. సేవలు మరిచారు..

- నిరుపయోగంగా విలేజ్ హెల్త్ క్లినిక్

ప్రజాశక్తి -ఖాజీపేట

'ప్రభుత్వ ఆసుపత్రుల్లో కార్పొరేట్ తరహా వైద్యం అందిస్తాం.. ప్రజలకు మెరుగైన వైద్య సేవలు అందించడమే ప్రభుత్వ లక్ష్యం.' ఇటువంటి మాటలు మనకు తరచూ విన్పిస్తుంటాయి.. కానీ వాస్తవానికి ఇందుకు పూర్తి భిన్నంగా ఉంటుంది. ఇందుకు ఉదాహరణే నిరుపయోగంగా ఉన్న విలేజ్ హెల్త్ క్లినిక్ వివరాలు.. మండలం పరిధిలోని పత్తూరు పంచాయతీ డాంఖాన్‌పల్లె గ్రామంలో లక్షలు వ్యయం చేసి నూతనంగా డాక్టర్ వైఎస్ఆర్ విలేజ్ హెల్త్ క్లినిక్ కేంద్రం నిర్వించారు. నిర్మించి కొన్ని నెలలవుతున్నా ఇంతవరకూ ప్రారంభించిన పాపాన పోలేదు. లక్షలాది రూపాయలు ఖర్చు చేసి ప్రజలకు అందుబాటులోకి తేవడంపై పలువురు ప్రజలు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. గ్రామంలో ఎవరికైనా ఆరోగ్యం బాగోలేక విలేజ్ హెల్త్ క్లినిక్ కేంద్రానికి వెళ్తే అక్కడ ఎప్పుడూ మూసి ఉండడంతో ఏమి చేయలేక వెనుదిరిగావాల్సి వస్తుందని గ్రామస్తులు వాపోతున్నారు. దీంతో ప్రభుత్వం ఎంతో ఉన్నతాశయంతో నిర్మించిన హెల్త్ క్లిన్ నిరుపయోగంగా మారింది. నెలకు ఒకటో, రెండు సార్లు మాత్రమే తెరుస్తారని అదీ సకాలంలో తెవరకపోవడంతో ఇబ్బందులు పడుతున్నామని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఇప్పటికైనా వైద్య శాఖ ఉన్నత అధికారులు స్పందించి వైద్య కేంద్రం సకాలంలో తెరిచి రోగులకు మెరుగైన వైద్య సేవలు అందించేలా చర్యలు తీసుకోవాలని ప్రజలు కోరుతున్నారు.

తెరుచుకోని విలేజ్ హెల్త్ క్లినిక్

మహిళలు అన్నిరంగాల్లో ముందంజ

ప్రజాశక్తి - కడప అర్బన్/కడప

మహిళలు అన్నిరంగాల్లో ముందున్నారని బాలికల కళాశాల అధ్యాపకురాలు నీలవేణి అన్నారు. శుక్రవారం ఎపి ప్రభుత్వ ఉద్యోగుల సంఘం జిల్లా కార్యాలయంలో అంతర్జాతీయ మహిళా దినోత్సవం పుస్కరించుకుని కేక్ కట్‌చేసి వేడుకలు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ మహిళలకు సాధ్యమం కాని రంగం ఏదిలేదని పేర్కొన్నారు. గొప్పవారిని స్ఫూర్తిగా తీసుకుని ముందుకు వెళ్లాలని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో ఎపిజిఇఎ ఆఫీస్ బేరర్స్ రామరంజిత, వెంకట సుబ్బమ్మ, రేణుక, మరియకుమారి, సంఘం జిల్లా అధ్యక్షులు రమేష్‌కుమార్, కార్యదర్శి సుదర్శన్‌రెడ్డి, రాష్ట్ర కార్యదర్శి రఘు రామనాయుడు, నగర అధ్యక్షులు కృష్ణప్రసాద్, కార్యవర్గ సభ్యులు ప్రసాద్‌గౌడ్, మార్క్, రామాంజనేయులురెడ్డి, అమృతరామయ్య, వి.వి.చంద్రశేఖర్, మహిళా ఉద్యోగులు పాల్గొన్నారు. **కెఒఆర్ఎంలో..** నగరంలోని కెఒఆర్ఎం ఇంజినీరింగ్ కళాశాలలో ప్రపంచ మహిళా దినోత్సవ వేడుకలు ఘనంగా నిర్వహించారు. శుక్రవారం కళాశాలలో నిర్వహించిన కార్యక్రమానికి టిడిపి కడప నియోజక వర్గ అభ్యర్థి మాధవిరెడ్డి, కళాశాల కరస్పాండెంట్ లిఖితరెడ్డి, కందుల గ్రూప్ ఆఫ్ ఇన్స్టిట్యూట్ కరస్పాండెంట్ కందుల రాజేశ్వరమ్మ హాజరయ్యారు. మాధవిరెడ్డిని సన్మానించారు. కార్యక్రమంలో ప్రిన్సిపల్ లావణ్య, ఉమెన్ డెవలప్‌మెంట్ సెల్ కో-ఆర్డినేటర్ హరిత, అధ్యాపకులు, విద్యార్థులు పాల్గొన్నారు. **కాంగ్రెస్ పార్టీ ఆధ్వర్యంలో..** మహిళలు అన్ని రంగాల్లో రాణించాలని కాంగ్రెస్ పార్టీ రాష్ట్ర మహిళా ఉపాధ్యక్షులు శ్యామలమ్మ అన్నారు. కాంగ్రెస్ పార్టీ కడప జిల్లా కార్యాలయంలో ఏర్పాటు చేసిన కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీకి వివిధ సేవలు అందించిన వికలాంగ మహిళ టి. ప్రేమలతను ఘనంగా సత్కరించారు. కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ మహిళా నగర అధ్యక్షురాలు వేముల నాగరత్నగౌడ్, వి రమాదేవి, మహిళా విభాగం జిల్లా కార్యదర్శి, పైడికల్వ నాగరాణి, జిల్లా కార్యదర్శి,

చింతకొమ్మదిన్నె : విజేతకు బహుమతి అందజేస్తున్న మేనేజర్ నరేష్‌చావా

పిసిసి రాష్ట్ర కార్యదర్శి చీకటి చార్లెస్, సత్యనారాయణ పాల్గొన్నారు. **ఎపిపిఎఫ్ జిల్లా అధ్యక్షులు మల్లెం విజయభాస్కర్ ఆధ్వర్యంలో..** నగరంలోని ఆర్‌కె నగర్ షాలేం ప్రార్థన మందిరంలో మహిళా దినోత్సవ వేడుకలు నిర్వహించారు. ఈ సందర్భంగా షాలేం ప్రార్థన మందిరం అధ్యక్షురాలు సిస్టర్ రాజకుమారిని, అలాగే సిస్టర్ కే ప్రనూషను సన్మానించారు. కార్యక్రమంలో కె ప్రనూష, ఎం ప్రభావతి, బి శారద, సునీత, సుజాత, జ్యోతి పాల్గొన్నారు. **చింతకొమ్మదిన్నె :** మహిళలు అన్ని రంగాల్లో రాణించాలని ఎయిల్ డిక్సన్ ప్రయివేట్ లిమిటెడ్ సీనియర్ హెచ్ఆర్ మేనేజర్ నరేష్ చావా పేర్కొన్నారు. మహిళా దినోత్సవం సందర్భంగా ఎయిల్ డిక్సన్ కంపెనీ వారు మహిళలకు డ్రాయింగ్ అండ్ డాన్సీ ర్యాంప్, సింగింగ్ పోటీలు నిర్వహించారు. అందులో విజేతలుగా నిలిచిన వారికి బహుమతులు ప్రదానం చేశారు. ఈ సందర్భంగా నరేష్ చావా మాట్లాడుతూ ప్రస్తుత కాలంలో మహిళలు పురుషులతో సమానంగా అన్నిరంగాల్లో రాణిస్తూ కుటుంబానికి ఆసరాగా నిలుస్తున్నారని చెప్పారు. ప్రతి ఒక్కరూ మహిళలను గౌరవించాలన్నారు. **ఊటుకూరులో..** నెహ్రూ యువ కేంద్రం కడప శాఖ, సస్టైనబుల్ ఆర్గనైజేషన్ ఫర్ సీకర్స్ సంయుక్త ఆధ్వర్యంలో చింతకొమ్మదిన్నె పరిధిలోని ఊటుకూరులో పొదుపు సంఘాల మహిళలతో కలిసి మహిళా దినోత్సవం నిర్వహించారు. ముఖ్య అతిథిగా బిసిడిఎస్ చైర్మన్ యాగప్ప, ఆర్‌పి నీలం రామలక్ష్మి, ఆశా వర్కర్ లక్ష్మీదేవి ఆర్గనైజేషన్ ఫర్ సీకర్స్ చైర్మన్ నరసింహ ప్రసాద్ పాల్గొన్నారు. **ప్రొద్దుటూరు :** స్థానిక ఎన్‌జిఒ హోమ్‌లో ప్రొద్దుటూరు తాలూక అధ్యక్షులు రఘురామిరెడ్డి సహకారంతో మహిళావిభాగం ఆధ్వర్యంలో ఉత్సవాలు నిర్వహించారు. ఈసందర్భంగా రఘురామిరెడ్డి మహిళాదినోత్సవ ఆవిర్భావం, విశిష్టత వివరించారు. కార్యక్రమంలో మెడికల్‌ఆఫీసర్ డాక్టర్ ఇలియారాణి, సావిత్రమ్మ, వుమెన్‌వింగ్ కన్వీనర్ సుజాత కో-చైర్మన్ ప్రమీలాదేవి మహిళా నాయకులు, ఎన్‌జిఒ నాయకులు పెద్దఎత్తున పాల్గొన్నారు. అనంతరం పలువురికి సన్మానాలు చేశారు.

కడప : ప్రేమలతను సన్మానిస్తున్న కాంగ్రెస్ మహిళా నాయకులు

విద్యుత్ కాంట్రాక్ట్ కార్మికులు మోసపోయారు

ప్రజాశక్తి - ఎర్రగుంట్ల

విద్యుత్ కాంట్రాక్ట్ కార్మికులు రెగ్యులర్ విషయంలో ప్రభుత్వం చేతిలో మోసపోయారని కాంట్రాక్ట్ కార్మిక సంఘం ఆర్‌టిపిపి రీజినల్ కార్యదర్శి సాంబశివారెడ్డి అన్నారు. శుక్రవారం ఆర్‌టిపిపిలో నిర్వహించిన విలేకరులు సమావేశంలో ఆయన మాట్లాడుతూ 2017 నవంబర్ 9న పాదయాత్రలో భాగంగా ఎర్రగొండ పట్టణంలో నిర్వహించిన బహిరంగ సభలో ముఖ్యమంత్రి జగన్మోహన్ రెడ్డి విద్యుత్ కాంట్రాక్టు కార్మికుల రెగ్యులర్ పై ఇచ్చిన మొదటి హామీని తుంగలో తొక్కారని విమర్శించారు. విద్యుత్ లేనిదే చిన్న పని కూడా జరగదని అలాంటిది విద్యుత్ శాఖలో పనిచేస్తున్న విద్యుత్ కాంట్రాక్ట్ కార్మికుల జీవితాలు మాత్రం అంధకారంలో ఉన్నాయని అన్నారు. ఆ తెలంగాణలో 2017లో 23 వేల మంది విద్యుత్ కాంట్రాక్టు కార్మికులను పర్మినెంట్ చేసి సంస్థలో విలీనం చేశారని అన్నారు. వేతనాల్లోనూ న్ స్కిల్డ్ నుండి హై స్కిల్డ్ వరకు రూ. 7000 నుండి రూ.16,000 వరకు వ్యత్యాసం ఉందని తెలిపారు. కానీ ఇక్కడ పనిచేస్తున్న కాంట్రాక్టు ఉద్యోగులను పర్మినెంట్ చేయకపోగా ఒక రూపాయి కూడా జీతం పెంచడం లేదని ప్రభుత్వంపై మండిపడ్డారు. 2024 ఎన్నికల్లో రాష్ట్రంలోని 24 వేల మంది విద్యుత్ కాంట్రాక్టు కార్మికులు, 1.8 లక్షల మంది వారి కుటుంబ సభ్యుల ఆదరణను ముఖ్యమంత్రి జగన్మోహన్ రెడ్డి కోల్పోవాల్సి వస్తుందని హెచ్చరించారు. ఇప్పటికైనా ఇచ్చిన మాట ప్రకారం అర్హత, అనుభవం ఆధారంగా విద్యుత్ కాంట్రాక్ట్ కార్మికులను రెగ్యులర్ చేయాలని ముఖ్యమంత్రిని ఈ సందర్భంగా ఆయన కోరారు.

అప్పస్వామి ఆలయానికి జనరేటర్ వితరణ

ప్రజాశక్తి - సింహాద్రిపురం

మండలంలోని గురిజాలలో వెలసిన శ్రీ అప్పస్వామి ఆలయానికి జనరేటర్ వితరణగా అందజేశారు. శుక్రవారం మహా శివరాత్రి పండుగను పురస్కరించుకుని విద్యుత్ శాఖ లైన్‌మెన్ మంజుల వెంకట శేఖర, వెంకట కుమారి దంపతులు రూ.34 వేలు విలువ చేసే జనరేటర్ ను ఆలయ ధర్మకర్త ఏ. భాస్కర్ రెడ్డి అందజేశారు. ఆలయ అర్చకులు మురళిస్వామి జనరేటర్‌కు పూజలు నిర్వహించిన అనంతరం వినియో గించారు. కార్యక్రమంలో గ్రామస్తులు కర్ణాకర్ రెడ్డి పాల్గొన్నారు.

ఆలయానికి జనరేటర్ వితరణ చేస్తున్న లైన్‌మెన్

మాట్లాడుతున్న కరస్పాండెంట్ తరుణేంద్రశేఖర్

సెమిస్టర్ ఫలితాలలో ఆర్‌టిడి డిగ్రీ కళాశాల విజయభేరి

ప్రజాశక్తి - ప్రొద్దుటూరు(పుట్టపర్తి సర్కిల్)

స్థానిక మైదుకూరు రోడ్డులోని రాణి తిరుమల దేవి డిగ్రీ కళాశాల విద్యార్థిని విద్యార్థులు 2023 డిసెంబర్, జనవరి నెలలో యోగివేమన యూనివర్సిటీ వారు నిర్వహించిన మొదటి సెమిస్టర్ డిగ్రీ హానర్స్ పరీక్ష ఫలితాలలో చక్కటి ప్రతిభను కనబరిచి యూనివర్సిటీ స్థాయిలో అత్యధిక జిపిఎ సాధించారని కళాశాల ప్రిన్సిపల్ టి. చంద్రశేఖర్‌రెడ్డి తెలిపారు. ఫలితాలలో తమ కళాశాల విద్యార్థులు బిఎస్‌సి హానర్స్ కంప్యూటర్ సైన్స్‌లో ఎం.విజయలక్ష్మి 10/10 జిపిఎ, ఎం.వీరభార్గవి 9.5, జెఎస్ యాసిన్ 9.5, ఫస్ట్ బయోటెక్నాలజీలో ఎస్ షాహిన్ 10/10, బి సమీనా మహబూబ్ 9.5, శ్రీలత 9.5, ఎస్ సల్మా రంబు భాయ్ 9.5, టి వాణి 9.5, అలియా మోహిన్ 9.5 సాధించారని చెప్పారు. బికాం హానర్స్ కంప్యూటర్స్ అప్లికేషన్‌లో, బి. గంగా భవానీశ్వరి 9.5, ఎస్ రిజ్వానా భాను 9.5 జిపిఏ పాయింట్స్ సాధించారని తెలిపారు. మంచి ప్రతిభను కనపరిచిన విద్యార్థిని, విద్యార్థులను కళాశాల కరస్పాండెంట్ తరుణేంద్ర శేఖర్, ఎన్ఎస్ఎస్ ప్రోగ్రామ్ ఆఫీసర్, ఇన్‌ఛార్జి ప్రిన్సిపల్ ఎస్. వెంకటేశ్వర్ రెడ్డి, డైరెక్టర్ సుబ్బరాయుడు, అధ్యాపకులు అధ్యాపకేతర బృందం వారిని అభినందించారు.

ఎస్‌విడిసి విద్యార్థులకు యూనివర్సిటీ ర్యాంకులు

ప్రొద్దుటూరు పట్టణం శ్రీకృష్ణ గీతాశ్రమంలోని శ్రీ వెంకటేశ్వర డిగ్రీ కళాశాల విద్యార్థులు యోగి వేమన యూనివర్సిటీ విడుదల చేసిన డిగ్రీ మొదటి సెమిస్టర్ ఫలితాలలో యూనివర్సిటీ స్థాయిలో ఫస్ట్ ర్యాంకులను సాధించారని కళాశాల కరస్పాండెంట్ ఏ హరినారాయణ తెలిపారు. డిగ్రీ మొదటి సెమిస్టర్ ఫలితాలలో బిఎస్‌సి జువాలజీ బయోటెక్నాలజీ జి. తేజస్విని 10/10, వి.తన్మయ 10/10, కె.జ్ఞాన శ్రీ 10/10, బిసిఎ గ్రూపులో టీ. నూరిన్ 10/10 జిపిఎస్ యూనివర్సిటీ ఫస్ట్ ర్యాంకులను సాధించారన్నారు. బిఎస్‌సి జువాలజీ గ్రూపులో చందన 9.50, లాలస 9.50, అశ్విని 9.50, బిఎస్సి బయోటెక్నాలజీ గ్రూప్‌లలో ఫర్వా 9.50, బిఎస్‌సి జువాలజీ విభాగంలో మాధవి 9.00, సంధ్యా 9.00,ఆస్మా 9.00,నిత్య 9.00, తస్లీమ్ 9.00,బీకాం కంప్యూటర్స్‌లో హసీనా 9.00, బిసిఎ విభాగంలో అఫ్జాల్ 9.00, బిఎస్‌సి కంప్యూటర్ విభాగంలో నాగ కళ్యాణి 9.00 సుప్రజా 9.00 జిపిఎసాధించారన్నారు. ఇంతటి విజయాన్ని సాధించిన విద్యార్థులను ప్రిన్సిపల్ డాక్టర్ ముస్తఫా, వైస్ ప్రిన్సిపల్ భవాని, ఇన్‌ఛార్జి ప్రిన్సిపల్ శ్రీకాంత్ రెడ్డి, రామ్మోహన్, హెచ్ఒడిలు గౌరీ శంకర్, మౌనయ్య,అబ్రా, గంగాభవాని అభినందించారు

ర్యాంకులు సాధించిన విద్యార్థులను అభినందిస్తున్న కళాశాల యాజమాన్యం

సిరిగిరెడ్డి సూర్యనారాయణరెడ్డి నేత్రదానం

ప్రజాశక్తి -పులివెందుల రూరల్

పులివెందుల మండలం ఎర్రిపల్లి గ్రామానికి చెందిన విశ్రాంత ఉపాధ్యాయులు సిరిగిరెడ్డి సూర్యనారాయణరెడ్డి (6 నేత్రదానం చేశారు. ఆయన మరణించడంతో సతీమణి సుశీల, కుమారుడు శ్రీకాంత్‌రెడ్డి, కోడలు సునీత, తమ్ముడు గోపాల్ రెడ్డి, మరదలు మంగమ్మ, చెల్లెలు శారద, బావమరిది ఆనంద్‌రెడ్డి నేత్రదానానికి అంగీకరిస్తూ స్నేహిత అమృత హస్తం సేవాసమితి నేత్ర సేకరణ కేంద్రం అధ్యక్షులు రాజుకు సమాచారం ఇచ్చారు. టెక్నీషియన్ హరీష్‌తో కలిసి మృతుని స్వగృహంలోపార్థివ దేహం నుంచి కార్నియాలను సేకరించి హైదరాబాద్‌లోని డాక్టర్ అగర్వాల్ నేత్రనిధికి పంపినట్లు సేవాసమితి అధ్యక్షులు రాజు తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మనిషి మరణానంతరం మట్టిలో కలసి పోయే నేత్రాలు దానం చేయడం ద్వారా చూపు లేనివారి చూపు ఇచ్చి మరణించిన తరువాత కూడా ఈ లోకాన్ని చూసే అవకాశం గొప్పవరమన్నారు. కుటుంబంలోని వ్యక్తి లేదా సన్నిహితులు మరణించిన వెంటనే 9966509364 లేదా 7093 204537లలో సంప్రదించినట్లు అయితే పార్థివ దేహం నుండి కార్నియాలను సేకరించి అంధత్వంతో బాధపడుతున్న అంధులకు అమర్చి ఇద్దరు అంధుల జీవితాల్లో వెలుగులు నింపిన వారవుతారన్నారు. ఈ సందర్భంగా నేత్రదానానికి అంగీకరించి, నేత్రదానం చేసిన సూర్యనారాయణ రెడ్డి కుటుంబ సభ్యులకు మార్కెట్ కమిటీ వైస్ చైర్మన్ సర్వోత్తం రెడ్డి, మాజీ సర్పంచ్ మల్లేశ్వర్ రెడ్డి, గ్రామస్థులు, బంధువులు, సన్నిహితులు, సేవాసమితి పట్టణ అధ్యక్షులు మహమ్మద్ రఫీ, సభ్యులు కృతజ్ఞత అభినందనలు తెలిపారు.

కిటకిటలాడిన శైవ క్షేత్రాలు

చక్రాయపేట: కల్యాణోత్సవం సందర్భంగా కళాకారుల కోలాటం

ప్రజాశక్తి - సింహాద్రిపురం

మండలంలోని శివాలయాలు కిటకిటలాడాయి. శుక్రవారం మహా శివరాత్రి పండుగను పురస్కరించుకుని ప్రజలు ఉదయం నుంచి ఆలయాలకు వెళ్లి ప్రత్యేక పూజలు నిర్వహించారు. జిల్లాలో ప్రసిద్ధిగాంచిన భాను కోట సోమేశ్వర క్షేత్రంలో శివునికి ఆలయ అర్చకులు బద్రి ఆధ్వర్యంలో ప్రత్యేకంగా పూజలు చేశారు. అదేవిధంగా మండల కేంద్రమైన సింహాద్రిపురం లోని శివాలయం, గురజాలలోని అవధూత అప్ప స్వామి ఆలయంలో ప్రత్యేక పూజలు నిర్వహించారు. మధ్యాహ్నం నుంచి అన్నదానం చేపట్టారు. ఎలాంటి అసౌకర్యం లేకుండా ప్రత్యేక చర్యలు తీసుకున్నారు. **చెన్నూరు :** మహాశివరాత్రి పండుగను పురస్కరించుకుని మండలంలోని వివిధ ప్రాంతాల్లో నెలకొన్న శివాలయాలు భక్తులతో పోటెత్తాయి. మండలంలోని బలిసింగాయపల్లి గ్రామ పరిధిలో కైలాసగిరి కోనలో వెలసిన సిద్ధ లింగేశ్వర స్వామి ఆలయంలో ఉదయం ప్రత్యేక అభిషేక పూజలు నిర్వహించారు. ఉదయం 9 గంటలకు కమలాపురం శాసనసభ్యుడు పి రవీంద్రనాథ్ రెడ్డి తనయుడు పి నరేన్ రామాంజనేయులు రెడ్డి ఆలయంలో పూజలు నిర్వహించారు. అనంతరం జాతీయస్థాయిలో ఒంగోలు జాతి బండలాగుడు పోటీలను ప్రారంభించారు. వివిధ ప్రాంతాల నుంచి భారీ ఎత్తున భక్తులు కైలాసగిరి సిద్ధ లింగేశ్వర స్వామిని దర్శించుకున్నారు. భక్తులకు జిల్లా వైయస్సార్సీపి ఉపాధ్యక్షులు గుమ్మ రాజేంద్ర ప్రసాద్ రెడ్డి ఆధ్వర్యంలో భక్తులకు అన్నదాన కార్యక్రమం నిర్వహించారు. కార్యక్రమంలో స్వచ్ఛంద సేవకురాలు దాదిరెడ్డి భాగ్యమ్మ ఏర్పాట్లను పర్యవేక్షించారు. చెన్నూరు పెన్నా నది ఒడ్డున వెలసిన శ్రీ దాక్షాయిని సమేత మల్లేశ్వర స్వామి ఆలయంలో తెల్లవారుజాము నుంచి ప్రత్యేక పూజలు అభిషేకాలు నిర్వహించారు. వివిధ ఆలయాల పరిధిలో భక్తులు జాగరణ చేసేందుకు సాంస్కృతిక కార్యక్రమాలు భజనలు కీర్తనలు ఆలయ కమిటీ నిర్వాహకులు ఏర్పాటు చేశారు. **మైదుకూరు:** స్థానిక లక్ష్మీ మాధవరాయ యూత్ ఆధ్వర్యంలో శుక్రవారం నిర్వహించి భీమేశ్వర స్వామి దేవాలయంలోని శివరాత్రి ఉత్సవాలకు మైదుకూరు ఎమ్మెల్యే శెట్టిపల్లి రఘురాంరెడ్డి హాజరై స్వామివారిని దర్శించుకున్నారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే రఘురామిరెడ్డికి ఆలయ చైర్మన్ భూమిరెడ్డి సుబ్బరాయుడు, మాదరాయయ స్వామి యూత్ సభ్యులు స్వాగతం పలికి పూజలు నిర్వహించారు. కమిటీ సభ్యులు ఏలిశెట్టి ప్రసాద్, శ్రీమన్నారాయణ రెడ్డి, కె.పి.లింగన్న, బిన్, కిట్టు, కుశెట్టి రాయుడు, జిటి శ్రీధర్, సుధాకర్ రెడ్డి, మాధవరాయ యూత్ సభ్యులు పాల్గొన్నారు.చిన్నయ్యగారి పల్లెలో.. మండలంలోని చిన్నయ్య గారి పల్లె గ్రామ సమీపంలో వెలసిన ముక్కంటి మల్లేశ్వర స్వామి ఆలయంలో మహా శివరాత్రి సందర్భంగా చిన్నయ్యగారి పల్లె గ్రామ ప్రజల ఆధ్వర్యంలో స్వామి వారికి అభిషేకం, పూజలు నిర్వహించారు. **పులివెందుల రూరల్ :** నియోజకవర్గవ్యాప్తంగా మహా శివ రాత్రి వేడుకలు నిర్వహించారు. పట్టణంలోని శివాలయంలో రుద్రా స్వామి శివ స్వాములు, తెల్లవారుజామున స్వామికి ప్రత్యేక పూజలు , అభిషేకాలు నిర్వహించారు. మండలంలోని పలు ఆలయాల్లో శివరాత్రి ఉత్సవాలు వైభవంగా నిర్వహించారు. అన్నదానం చేశారు. వైసిపి మున్సిపల్ ఇన్‌ఛార్జి వై.ఎస్. మనోహర్ రెడ్డి, పురపాలక చైర్మన్ వరప్రసాద్, ఎపి పౌరసరఫరాల శాఖ డైరెక్టర్ గంగాధర్ రెడ్డి, నాలుగో వార్డ్ కౌన్సిలర్ వార్నపల్లి కిషోర్ లు శివాలయానికి వెళ్లి ప్రత్యేక పూజలు నిర్వహించారు. అనంతరం ఆలయ చైర్మన్ సుధాకర్ రెడ్డి, ఆలయ పరిపాలన అధికారి రమణ, కమిటీ సభ్యులు మాధవాచార్యులు వారికి శాలువా కప్పి పూలమాలతో సత్కరించారు.

వైభవంగా వెంకటేశ్వర స్వామి, శివపార్వతులకు కల్యాణం

ప్రజాశక్తి - చక్రాయపేట

మహాశివరాత్రి ఉత్సవాలు పునస్కరించుకొని స్థానిక మండల కేంద్రంలోని చక్రాయపేటలో శ్రీ వెంకటేశ్వర స్వామి, వీరభద్ర స్వామి దేవాలయ ఆవరణంలో ఒకే వేదిక పైన తిరుమల తిరుపతి దేవస్థాన వేద పండితులు ఎం.వి రాయల్ స్వామి మనోహర్ ఆచార్యులు, రామాయణం స్వామి, అశోక్ కుమార్ స్వామి, మోహన కృష్ణ స్వాముల వారు శివపార్వతులకు, శ్రీదేవి భూదేవి సమేత వెంకటేశ్వర స్వాములకు కనీవినీ ఎరుగని రీతిలో కల్యాణం నిర్వహించారు. కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా హాజరైన వైసిపి మండల ఇన్‌ఛార్జి వై.ఎస్ కొండారెడ్డికి బ్యాండ్ మేళాలతో స్వాగతం పలికారు. అనంతరం వెంకటేశ్వర స్వామి వీరభద్ర స్వామి దేవాలయాల్లో ప్రత్యేక పూజలు చేశారు. వారి చేతుల మీదుగా ఎద్దులో పోటీలను ప్రారంభించారు. ఉదయము నుంచి రాత్రి వరకు ఎడతెరిపి లేకుండా మల్ రెడ్డి మురళీధర్ రెడ్డి అన్నదానం ఏర్పాటు చేశారు. మండలంలోని చుట్టుపక్కల గ్రామాలే కాకుండా ఇటు వేంపల్లి అటు లక్కిరెడ్డిపల్లి మండలం నుంచి వేలాది మంది భక్తులు ఈ శివరాత్రి ఉత్సవాల్లో పాల్గొన్నారు. **ఉత్సాహభరితంగా బండలాడుగు పోటీలు** శివరాత్రి పండుగన పురష్కరించుకుని ఏర్పాటు చేసిన బండలాగుడు పోటీలు ఉత్సాహభరితంగా సాగాయి. 11 జతలు ఎద్దులు బండలాగుడు పోటీలో పాల్గొన్నాయి. గెలుపొందిన ఎద్దులకు నిర్వాహకులు బహుమతులు అందజేశారు. సాంస్కృతిక కార్యక్రమంలో భాగంగా వేముల మండలం కొత్తపల్లి గ్రామం నాగేంద్ర ఆధ్వర్యంలో అద్భుతమైన కోలాటం నిర్వహించారు. కోలాటం కార్యక్రమాన్ని మండల అధ్యక్షుడు మాధవి బాలకృష్ణ సహాయ సహకారాలతో నిర్వహించారు. కార్యక్రమంలో ఆ దేవస్థాన చైర్మన్ మోపురి రామాంజనేయరెడ్డి, మండల అధ్యక్షులు మాధవి బాలకృష్ణ, సర్పంచుల సంఘం అధ్యక్షుడు వెంకటసుబ్బయ్య, స్థానిక సర్పంచ్ అర్షద్ బాషా, మారెళ్ళ మడక సింగల్ విండో అధ్యక్షుడు శేషారెడ్డి, లోమడ రామాంజనేయరెడ్డి, మాజీ దేవస్థానం చైర్మన్లు, కర్నాటి హరినాథ రెడ్డి, చక్రపాణి రెడ్డి, ఓబుల్ రెడ్డి పెద్ద సంఖ్యలో ప్రజలుపాల్గొన్నారు.

వీరభద్ర స్వామిని దర్శించుకున్న ఎమ్మెల్యే

చాపాడు : మండల పరిధిలోని అల్లాడుపల్లె వీరభద్రస్వామిని మహాశివరాత్రి సందర్భంగా ఎమ్మెల్యే ఎస్.రఘురామి రెడ్డి, ప్రభావతమ్మ దంపతులు దర్శించుకున్నారు. ఆలయ కమిటీ సభ్యులు అర్చకులు ఆధ్వర్యంలో ఘనస్వాగతం పలికారు. ప్రత్యేక పూజలు నిర్వహించి తీర్థ ప్రసాదాలు అందజేశారు. కార్యక్రమంలో ఎంపిపి టి లక్షుమయ్య, వైసిపి మండల కన్వీనర్ రాజశేఖర్ రెడ్డి, సర్పంచ్ కిషోర్ కుమార్ రెడ్డి చైర్మన్ జివై వెంకటసుబ్బారెడ్డి, వైసిపి నాయకులు పివి రమణారెడ్డి, శ్రీకాంత్ రెడ్డి, వెంకట రెడ్డి, వెంకటసుబ్బారెడ్డి, నాగేశ్వర్ రెడ్డి కార్యకర్తలు పాల్గొన్నారు.



వీరభద్రస్వామిని దర్శించుకుంటున్న ఎమ్మెల్యే రఘురామిరెడ్డి